# తెలుగు నాటకం: సమయ శిల్పం

డాక్టర్ మొదలి నాగభూషణ శర్మ

"నాటక సమయాలు" అన్న పదం భరతాదులు నాందీ, ప్రస్తావనాదులను, సంధి సంధ్యంగాలను ఇతివృత్త నిర్మాణంలో ప్రదర్శించవలసిన తీరును గురించి చర్చించే సమయంలో ఉపయోగించారు. ఇతివృత్తాన్ని అంకాలుగా కోయడానికి కాలమూ ఆ కాలానుబద్ధమైన సన్నివేశమూ అనే సునిశితమైన కత్తుల్ని వాడారు సంస్కృత నాటక కర్తలు. వానిని సంధులన్నారు. అంతకన్న సూక్ష్మంగా విశ్లేషించడానికి సంధ్యంగాలు వగైరా సామగ్రిని ఆయత్తం చేసుకున్నారు.

ఆధునికి నాటక సమయాల్లో నాందీ ప్రస్తావనాదుల జోలి లేదు. కాని 'సమయం' అన్న కాలగమనాన్ని నాటకకర్త – ఒక్క నాటక కర్తే అనేమిటి? – సృజనాత్మక సాహిత్య అయిన ప్రతివాడూ – దృష్టిలో ఉంచుకోక తప్పదు. దాన్ని ఏదో ఒక విధంగా ప్రయుక్తం చేయకా తప్పదు. తెలుగు నాటకాల నిర్మాణ పంథాలో యీ సమయ శిల్పాన్ని శిల్ప చతురులైన తెలుగు నాటక రచయితలు ఎలా మలుచుకున్నారో చూద్దాం.

నిజానికి యీ సమయ శిల్పం – కాలగమన విశ్లేషణ – ప్రపంచ నవలా సాహిత్యంలో ఒక సంక్లిష్టమైన శిల్ప విన్నాణం. ఈ శిల్పాన్ని నవలల్లో ప్రయుక్తం చేయబడినంత విస్తృతంగా నాటకాలలో చేయకపోవడానికి ఆయా ప్రక్రియలలో ఉన్న వైవిధ్యం కారణమని చెప్పవచ్చు. నవలకు నాటకానికి ఉన్న అనంతమైన అంతరాల్లో ఒకటి – ఆ రెండు ప్రక్రియల్లో ఉపయోగించే కాలగమన విశ్లేషణా విధానంలోని అంతరమే! ఈ దృష్టితో చూస్తే కథనాత్మకమైన నవలకూ, దృశ్యమానమైన నాటకానికి ప్రధానమైన భేదం దృగ్గోచరం కాకమానదు. కథాకథనంలో అప్పటికే జరిగిపోయిన ఒక అంశాన్ని 'అలా జరిగింది' అని చెప్పే విధానం ఇమిడి వుంది. అంటే – భూతకాలంలో జరిగి, ముగిసిన కథను మనం వర్తమానంనుంచి చెబుతున్నామన్నమాట. నాటకం అలాకాదు. భూతకాలంలో జరిగిన సంఘటననయినా మనం దృశ్యమానం చేసేటప్పుడు అది జరిగిన విధానాన్ని 'చెప్పడం' కాక 'చూపుతున్నా'మన్నమాట. అంటే దానిని వర్తమానంగా మార్చి చూపుతున్నాం. ఈ విధమైన మార్పిడిలో అటు దృక్పథ విధానమూ, ఇటు నిర్మాణ విధానమూ కూడా మార్పు చెందడం వల్ల నవలకు, నాటకానికి యీ అంతరం స్పష్టంగా కన్పిస్తుంది.

ఏ కథలోనూ ఏదో ఒక కాలగమన పద్ధతిని అనుసరించకుండా – కథనం చేయడం జరగదు. ఇ.ఎం.ఫోర్‌స్టర్ చెప్పినట్లు ప్రతి సృజనాత్మక సృష్టిలోనూ ఎక్కడో గడియారం టిక్‌టిక్ వినిపిస్తూనే ఉంటుంది. కొందరు రచయితలు యీ గడియారాన్ని పరిగెత్తిస్తారు; కొందరు నత్తనడకలు నడిపిస్తారు; కొందరు గడియారం ముళ్లను వెనక్కో, ముందుకో తిప్పుతూ వుంటారు. కాని గడియారాన్నే ఒక విధంగా చూస్తే చరిత్రకు తన రచన ద్వారా జవాబుదారీ అవుతాడు. తన రచన కాల విభజనలో ఏదో ఒక కాలానికి చెంది వుంటుంది తాను ప్రయక్తం చేసే ప్రతి prop, decor తనువాడే ప్రతి సంభాషణా, తన పాత్రల ప్రతి చేతా, మాటా తాను

స్వీకరించిన కాలానికి బద్ధమైనదై ఉండాలి. పరస్పరం ఆధారభూతమైన యీ రెండు దృక్పథాల (దృక్కోణాలు)ను – ప్రతి రచనా ఒక నియమిత కాలంలో జరిగిన కొన్ని సంఘటనల కళాత్మకమైన సంఘటితం" – అలానే చరిత్రలో ఒక పూట" కూడా కావడం వల్ల – వాటి రెంటిలోగల వ్యత్యాసాన్ని గమనించాలి. మొదటి దానిని (ఆంతర కాలగమనాన్ని సూచించే విధానాన్ని) ఆంతర ప్రక్షిప్త కథానకమనీ, బాహిర కాలగమనాన్ని నిర్దేశించే విధానాన్ని విస్తృత కథానకమనీ – అనవచ్చు –

తన రచనలో ఒక నియమితమైన కాలగమనాన్ని స్వీకరించే రచయిత మూడు పద్ధతులను స్వీకరించవచ్చు. ఒకటి: కథాకాలానికి – అసలు సంఘటన కాలానికి తాదాత్మ్యతను సూచించడం. ప్రఖ్యాత గ్రీకు విమర్శకుడు అరిస్టాటిల్ నిర్దేశించిన unity of time ఐక్యత్రయంతోని కాలఐక్యం యిదే! దీని ప్రకారం అసలు జీవితంలో ఒక సంఘటన ఎంత కాలంలో జరిగిందో, రచనలోనూ అంతే కాలానికి దానిని పరిమితం చేయడం. నవలా రచనలో యీ పద్ధతిని ప్రశక్తంగా చూపినవాడు James Joyee:Lulysses నవలలో. నాటక రచనలో యీ పద్ధతి గ్రీకుల కాలం నాటికి అంతగా ఆచరణలో లేకపోయినా, అరిస్టాటిల్ సిద్ధాంత ప్రవర్తకులైన ఇటలీ దేశస్థుడు కాస్టర్ వెట్రో వంటి వారు దీనికి బాగా చేయూతనిచ్చారు. Neo-classical Age లో డ్రైడెన్ వంటి నాటక రచయితలు యీ కాల ఐక్యాన్ని దృష్టిలో వుంచుకునే Shakespear నాటకాలను కూడా తిరిగి రాయడానికి పూనుకునే సాహసం చేశారు!

ఈ సిద్ధాంతానికి నాటకంలో విపర్యయం కలుగుతూనే వస్తున్నది. యదార్ధవాదం (Theam of Realism) వాస్తవికతను యథాతథంగా పునర్మించాలని నిర్దేశించినా, రాను రాను వాస్తవికత (realism) అంటే రచయిత తనకు అనుగుణమైన కొన్ని సంఘటనలు అందుకు అవసరమైన కాలం కొలతని ఎన్నుకుని, దానిని పునర్నిర్మించే Select realismగా మారిపోయింది. ఒక అతి యదార్థ వాదమే (Naturalism) జీవితంలో ఒక సంఘటనకు పట్టే కాలాన్నే నాటకంలో కూడా వాదాలన్న వాదాన్ని లేవనెత్తింది. దానికి తెలుగు నాటకంలో అంతే వాసులు లేరనే చెప్పాలి.

రెండో పద్ధతి వాస్తవిక వాదులు స్వీకరించినది. కాలాన్ని హ్రస్వీకరించి, తన రచనలో మొదటి పేజీ నుంచి చివరి పేజీ పూర్తి అయ్యేలోపల చాలా సంవత్సరాలను దొర్లించి వేయవచ్చు. ఈ రెండు పద్ధతులను పరాప్తం చేసే మరో పద్ధతి ఉంది. అది భూత భవిష్యద్వర్తమానాలను వర్ణమాలలో రంగులు వొరుతున్నట్లు తనకు యిష్టం వచ్చినట్లుగా మార్చుకుంటూ పోవడం. ఈ పద్ధతి నవలల్లో ఎక్కువగా కనిపిస్తుంది. జరిగి పోయిన విషయాల జ్ఞాపకాలు, యిప్పటి ప్రత్యక్ష అనుభవాలు, రాబోయే విషయాల అవగాహన – ఇవీ మూడు ముప్పేటలూ కలిసి పోయనట్టు చూపడం యీనాటి నవలల ప్రత్యేకత. ఇక నాటకాలలో సంక్లిష్టతను చూపడానికి చేసిన కొన్ని కొత్త పద్ధతులను మనం గమనించాలి.

పౌరాణిక, చారిత్రక నాటకాల్లో ఆంతర కాలగమనాన్ని నిర్దేశించే ప్రక్షిప్తక కథానకం కాక బాహిర కాలగమనాన్ని నిర్దేశించే విస్తృత కథానకమే ముఖ్యం అవుతుంది. అంటే సంఘటనల వెనక ముందుల్ని, క్రమ

పద్ధతినీ, కాలాను క్రమణికనీ – ఇతివృత్త నిర్మాణానికి అవసరమైనంత మేరకే కాలనిర్దేశిక తార్కితను వాడుకుని మిగిలిన సూక్ష్మ విషయాలో వాని నియమాన్ని అంతగా పట్టించుకోవడం జరగదు. ఈ నాటకాల్లో మనం గమనించే ముఖ్యమైన విషయం – ఇది ఏ కాలానికి చెందిది; ఆ కాలం ఆచార వ్యవహారాలేమిటి? సంభాషణా రీతులెటువంటివి? – అవి యీ నాటకంలో నమ్మతగిన పద్ధతిలో ఉపయుక్తం చేయబడ్డాయా – అన్న విషయం. ఉదాహరణకు 'రామరాజు' నాటకంలో పఠానుగా నటిస్తున్న వ్యక్తి ఆనాటి స్థితిగతులను, పద్ధతులను తన పాత్ర ద్వారా – వాచిక, ఆహార్యాల ద్వారా వెల్లడించగలిగి ఉండాలి. అతడు రొట్టె తింటూ ప్రవేశించడం, గుర్రం దిగి, ఆ గుర్రాన్ని ప్రక్కనున్న గుంజకు కట్టినట్లు చూపడం – ఇవి అన్నీ ఆ పాత్ర చారిత్రక స్థితిని, దానికి అనుగుణమైన కాలనిర్దేశాన్ని వెల్లడిస్తాయి.

మన నాటక రచయితలుకాని, నటులు కాని, దర్శకులుకాని యీ చారిత్రక పాత్ర చిత్రణ విషయంలో తగినంత పరిశోధన చేసినట్లు కనిపించదు. యాదవ రాజైన కృష్ణుడు నీలిరంగు అంగీతోను, అరణ్యవాసం చేస్తున్న పాండవులు కాషాయంలోను, రారాజు దుర్యోధనుడు పైన ఒక్క ఉత్తరీయంతోను రావడం చూచి వారి విభిన్నమైన ఆహార్య పద్ధతులకు ఏదైనా తర్కబద్ధమైన కారణం ఉన్నదా అన్న సంశయం కలుగుతోంది.

నాటక సాహిత్యంలో మనకు సాధారణంగా ఎదురయ్యే కాలవిభజన ద్వారా సూచింపబడుతోంది. అయిదు అంకాల నాటకంలోకన్న ఆ అయిదు అంకాలను మరికొన్ని రంగాలుగా గూడా విభజించి నాటకం వ్రాసిన రచయితకు కాలాన్ని విశ్లేషించి ఉపయోగించుకోవడంలో ఎక్కువ సౌలభ్యం ఉంది. అయిదు అంకాలలోనే నాటకం వ్రాసే నాటక రచయితకు కాలాన్ని ఉపయోగించుకోవడంలో అంతటి సౌలభ్యం లేదు. ప్రముఖమైన అయిదు సంఘటనలను ఎన్నుకుని వానిని ఒకదానికన్న మరొక దానిని నాటకీయంగా కూర్చి నాటకం వ్రాయడంలో ఏకాంక పరిమితం కావడానికి వీలుగా సంఘటనల క్రోడీకరణ కష్టసాధ్యమే అయినా, నాటకానికి ఒక బిగిని సాధించగలుగుతుంది. అట్లాకాక అనేక రంగాలతో కూడిన అంకాలను కూర్చడం వల్ల రచయిత పని తేలిక అయినా నాటకంలో బిగి వుండదు. ఒకటి వస్తు వైవిధ్యం – రెండు ప్రదేశ వైవిధ్యం – మూడు వీనికి కారణమైన కాల వైవిధ్యం – కన్యాశుల్కం కథావస్తువు దృష్ట్యాకాని అత్యుత్తమమైన నాటకమే అయినా, సమయ విశ్లేషణను జాగ్రత్తగా గమనించకపోవడం వల్ల ప్రదర్శన సౌలభ్యం కుంటుపడ్డది.

అంకాలుగానో, రంగాలుగానో విభజించి సంఘటనలను రూపొందించే అన్ని నాటకాలలోను రచయిత మామూలుగా స్వీకరించేది linear timeనే! అంటే నిన్న, ఇవాళ, రేపు – అన్న సాఫీగా సాగే కాలమానమే! ప్రఖ్యాత నాటకాలన్నీ అలా సాగేవే! ఇందులో రచయితలకు, దర్శకులకు, ప్రేక్షకులకు ఒక సౌకర్యం ఉంది. ఈ పద్ధతి కథాగమనాన్ని, కాలగమనాన్ని ఒకే దిశలో నడిపించి వెనుక ముందుల అసందిగ్ధతను లేకుండా చేస్తుంది. అయితే, ఆధునిక ప్రయోగాల్లో కొన్ని – an linear time conceptని కాదని కొత్తదైన complex time conceptని వాడుతున్నారు.

ఈ ప్రయోగాల్లో సాధారణంగా కనిపించేది గతానికి వర్తమానానికి మధ్య జరిగే సంఘర్షణ. లేదా

వర్తమాన, భవిష్యత్తుల మధ్య జరిగే సంఘర్షణ.

వర్తమానానికి భవిష్యత్తుకు జరిగే సంఘర్షణలో ఊహాసౌధాల నిర్మాణానికి ఎక్కువ ప్రాధాన్యం ఉంటుంది. వర్తమానంలోని నిజం కన్న భవిష్యత్తులోని కలలు రమ్యంగా కనిపించడం, కలలు చెదిరి వాస్తవికతను గుర్తించడం యీ రకం నాటకాల్లో మనకు కనిపించే కథావస్తువు. అనిసెట్టి 'గాలిమేడలు' ఇటువంటి నాటకాల్లో మొట్టమొదటిది; ప్రశస్తమైనదీ కూడా. శ్రీవాత్సవ వ్రాసిన 'తీరని కోరికలు' వంటి నాటకాల్లో కూడా మనకు యీ సమస్యే ఎదురౌతుంది.

ఇంతకన్న గతం, వర్తమానం – వీటిమధ్య జరిగే సంఘర్షణలో విషాదాత్మకమైన నాటకబీజం కనిపిస్తుంది. గతాన్ని గుర్తు చేసుకోవడం – అది వర్తమాన జీవితానికి ఒక ఆశారేఖగానో, లేదా ఆశనిపాథంలాగానో మిగిలిపోవడం ఏ రచనకైనా భావ శబలతనీ, సార్వజనీనతను ఆపాదిస్తుంది. బెల్లంకొండ రామదాసు 'పునర్జన్మ'లో కథానాయిక గతం, బుచ్చిబాబు ఆత్మవంచనలో రాణి గతస్మృతులు యిటువంటివే! కాని గతం, వర్తమానం సమాంతర రేఖలుగా ఒకదాని ప్రక్కన ఒకటి నడుస్తూ వానిలోని అంతరాన్ని చూపడం – సమాంతర సమయ శిల్పం – అతి సకృతుగా కనిపిస్తుంది. యూజీన్ ఓనీల్ వ్రాసిన Beyond the Horizon ఆధారంగా గొల్లపూడి మారుతీరావు వ్రాసిన రాగరాగిణిలో యీ గత, వర్తమానాల తులనాత్మక ప్రదర్శన నాటకానికి విస్పష్టమైన నాటకీయతను సాధించింది. గతాన్ని, వర్తమానాన్ని ఒక్కొక్క రంగంలో ఇమిడ్చిన యీ నాటకంలో కాలాన్ని విభజించినట్లే దృశ్య పరికల్పనలో కూడా ఇంటిలోపలి భాగాన్ని, వెలుపలి భాగాన్ని చూపుతూ – అందులో కూడా పరస్పర సంఘర్షణని చూపింది.

గతంలో జరిగిన సంఘర్షణల ప్రభావం వర్తమానం మీద ఎంతగా పడ్డదో చూపడానికి నాటక రచయితలు చాలా విధానాలు రూపొందించుకున్నారు. అందులో ఒకటి, తేలికైనది – అయినా పటుత్వం కలిగింది – ఒక పాత్ర వర్తమానంలో ఉంటూనే ఒక్కసారి గతంలోకి వెళ్ళిపోవడం – మిగిలిన పాత్రలన్నింటినీ తనతోపాటు గతంలోకి తీసుకువెళ్లి వర్తమానంలో వారు దయనీయమైన పరిస్థితికీ గతంలో అందుకు భిన్నమైన పరిస్థితికీ ఉన్న అంతరాన్ని చూపడం. ఇది దాదాపు సమకాలీన నాటకాలన్నింటిలోను ప్రయుక్తం చేయబడే విధానం.

మరో విధానం నాటకంలో పాత్రల్ని, వారి వారి జీవితాల్లో జరిగిన, జరుగుతున్న కొన్ని ముఖ్యమైన సన్నివేశాల్ని ప్రత్యక్ష వ్యాఖ్యాతలాగా ప్రేక్షకులకు పరిచయం చేయడం; సంస్కృత నాటకాల్లో కొంతవరకు, యక్షగానాదుల్లో చాలా వరకు అనుసరించే పద్ధతి యిదే! యిందులో సూత్రధారుడు ఆయా పాత్రల పరిచయాన్ని యిస్తూనే, వారితో మాట్లాడే ప్రధాన పాత్రధారికూడా అయిపోతాడు. పాశ్చాత్య దేశాల్లో Expressionism, Epic Theatre వంటి ప్రక్రియల్లో యీ ప్రయోగాన్నే మరికొంత ముందుకు తీసుకుపోయి కేవలం కథను నడపడానికి, పాత్రలను పరిచయం చేయడానికి మాత్రమే కాక, సూత్రధారుడు ఆయా పాత్రల జీవితాల్లో జరిగిన సంఘటనలని తులనాత్మకంగా మన ముందు ఉంచడంలో సాయపడతాడు.

ఇటువంటి వ్యాఖ్యానం – ఎన్.ఆర్.నంది వ్రాసిన మరో మహాంజదారోలో మనకు కనిపిస్తుంది. నలుగురు మనుషుల గత జీవితం, వర్తమాన జీవితం మీద దాని ప్రభావం – వర్తమానం నుంచి ఆ మనుషుల్ని కదిపి గతంలోకి తీసుకుపోయి, నిజాన్ని వెల్లడించి, ఆయా పాత్రల మీద మనకు కలిగే అభిప్రాయాలను తారుమారు చేసే ఒక సాంఘిక శాస్త్రవేత్తగాను, సామాజిక జీవిన విధానంపై న్యాయ నిర్ణయం చేసే ఒక న్యాయాధికారి గానూ కనిపిస్తాడు అందులో సూత్రధారుడు – తద్వారా రచయిత.

ఈ విధమైన కాల విభజనని చూపడానికి యీనాడు ఎన్నో వినూత్నమైన దృశ్య, కాంతి ప్రసరణ విధానాలను ఉపయోగిస్తున్నారు. వెలుగును, ప్రక్షిప్తం చేయడం, భిన్నమైన రంగ ప్రదేశాలను వేరు వేరు ఎత్తుల్లో ఏర్పాటు చేయడం, తెరవెనుక 'నీడ'లుగా గతంలోని వ్యక్తుల్ని, తెరముందు నిజమైన వ్యక్తులుగా వర్తమానంలోని వ్యక్తుల్ని చూపడం – యీ పద్ధతుల్లో కొన్ని.

కొన్ని నాటకీయమైన సంఘటనలని నియమితమైన కాలానికి అనుసంధానించడం నాటక రచయితల చేసే పనిలోని ఆంతర్యం. దాన్ని మూడు పద్ధతుల ద్వారా సాధిస్తాడు రచయిత.

1. ఏకకాలంలో భిన్నమైన సంఘటనలను చూపడం
2. సంఘటనలలో ఏకత్వం – కాలంలో భిన్నత్వం
3. ఏకకాలంలో బహు సంఘటనలు జరగడం

ఒకే రకమైన సంఘటనలు మూడు తరగతులకు చెందిన వ్యక్తులమీద ఎలాంటి ప్రభావాన్ని కలగచేస్తాయో సూచించే గణేశ్ పాత్రో తరంగాలు, మూడుతరాల వ్యక్తుల్లో ఎలాంటి ప్రభావాన్ని కలగచేస్తాయో అతనిదే కొడుకు పుట్టాల, హరనాథ్ క్షీరసాగరమథనం వంటి నాటకాల్లో ఉపయోగించారు.

ఇటీవలి నాటకాల్లో – ముఖ్యంగా నాటికల్లో – కాలాన్ని పరిగెత్తించడానికి రచయిత ప్రతీకలని చూపడం మామూలు పద్ధతి.

స్థల, కాలనిర్దేశాలని తెరల మీద చూపడం, కొన్ని పాత్రల చేత నాటకీకరించబడిని కథని కథాకథనం ద్వారా చెప్పించడం: దీనిని యండమూరి వీరేంద్రనాథ్ 'రుద్రవీణ'లో చక్కగా నిర్వచించాడు.

అలాగే ఒకే కాలంలో విభిన్న వ్యక్తుల participationని చూపడానికి – ఒకరు మాట్లాడుతూ వుంటే పలువురు మూకాభినయం (mime) చేయడం; ఒక levelలో పాత్రలు అభినయిస్తూ ఉంటే – మరో అంతస్థులో పాత్రలు mime చేయడం కొత్త పద్ధతి. మాలపల్లి నాటకీకరణలో ఎ.ఆర్.కృష్ణ – ఈ పద్ధతినే పటిష్టంగా ఉపయోగించారు. శశిమోహన్ 'కోహినూర్'లో భాషణ – లను – త్వరితంగా చూపుతూ నాటకీయతను పరాకాష్టకు తీసుకువచ్చాడు.

ఇదికాక కాలగమనాన్ని పూర్తిగా మార్చివేస్తూ లైట్లు ఉన్నప్పుడు చీకటిగా ఉన్నదని, లైట్లు dime చేసినప్పుడు వెలుతురు బాగా ఉన్నదనీ dramatic illusionను నాటక కథావిష్కరణకు చక్కగా మలుచుకున్న నాటకం Black Comedy – దాని తెలుగు అనుసరణ – ఈ విధంగా మామూలు సమయాన్ని నాటక సమయంగా మలుచుకోవడంలో ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న అనేక ప్రయోగాలలో కొన్ని తెలుగులో కూడా విజయవంతంగా జరిగాయనడం నిర్వివాదం. అయితే అన్ని కాలాల్నీ "వర్తమానీకరించే" రసాయన ప్రయోగం నాటకం కనుక దానిలో బహుముఖ కాల విన్యాసాన్ని సూచించే వినూత్న పద్ధతుల ఆవిష్కారానికి యింకా ఎంతైనా ఆస్కారం ఉంది. దానికి తెలుగు నాటక రచయితలు కూడా పాటుపడి పటిష్టమైన ప్రయోగాలను చేస్తారని నా ఆశంస.